


# హైదరాబాద్‌లో వైభవంగా రెండో బ్రిక్స్ అవినీతి నిరోధక సమావేశాలు

## అంతర్జాతీయ సహకారంతోనే అవినీతి రహిత పాలన

**హైదరాబాద్, ఆగస్టు 5, రాజముద్ర న్యూస్:** తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో జరిగిన రెండో బ్రిక్స్ అవినీతి నిరోధక కార్యబృంద సమావేశం, ఆస్తుల పునరుద్ధరణపై బ్రిక్స్ నిపుణుల నెట్‌వర్క్ సమావేశాలు బుధవారం విజయవంతంగా ముగిశాయి. భారత్ అధ్యక్షతన 'పటిష్ఠత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరతల కోసం నిర్మాణం' అనే ప్రధాన ఇతివృత్తంతో ఆగస్టు 4, 5 తేదీల్లో ఈ సదస్సును నిర్వహించారు. సభ్య దేశాలకు చెందిన ఉన్నతస్థాయి విధాన రూపకర్తలు, నిపుణులు, అవినీతి నిరోధక, ఆర్థిక నిఘా, చట్టాల అమలు సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

**నేరగాళ్ల అప్పగింతకు భారత్ కీలక ప్రతిపాదన**

సుపరిపాలన, సుస్థిరాభివృద్ధి, ప్రజా విశ్వాసాలకు నైతికత, సమగ్రతలే అత్యంత కీలకమని, అవినీతిని ఎంతమాత్రం సహించని విధానానికి భారత్ కట్టుబడి ఉందని అధికారులు స్పష్టం చేశారు. పారదర్శకత, జవాబుదారీతనం కోసం సాంకేతికత ఆధారిత పాలనతో పాటు నిరంతర అంతర్జాతీయ సహకారం అవసరమని ఉద్ఘాటించారు. దేశం దాటి పరారైన అవినీతి నేరగాళ్లను పట్టుకోవడంలో, వారిని మాతృదేశానికి అప్పగించడంలో అంతర్జాతీయ సమన్వయాన్ని పెంపొందించేందుకు భారత్ ప్రతిపాదించిన ప్రత్యేక నిపుణుల నెట్‌వర్క్‌కు బ్రిక్స్ దేశాల నుంచి విశేష మద్దతు లభించింది. సభ్య దేశాల మధ్య సకాలంలో సమాచార మార్పిడి, అధికారిక సంస్థల సమన్వయాన్ని సులభతరం చేసేలా ఒక ప్రత్యేక సమాచార నిధి ఏర్పాటును ప్రతినిధులు స్వాగతించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సిబ్బంది, శిక్షణ విభాగ కార్యదర్శి రచనా షా, వివిధ బ్రిక్స్ సభ్య దేశాల ఉన్నతస్థాయి ప్రతినిధులు, విధాన రూపకర్తలు, నిపుణులు, అవినీతి నిరోధక, ఆర్థిక నిఘా, చట్టాల అమలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట...

- గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు...
- మాసాని గూడ గ్రామ సర్పంచ్ బద్రి అర్చన ప్రభుగౌడ్





**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** మాసాని కూడా గ్రామ అభివృద్దే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని గ్రామ సర్పంచ్ బద్రి అర్చన ప్రభు గౌడ్ పేర్కొన్నారు. బుధవారం రోజు గ్రామ పంచాయతీ ఏడవ వార్డు కచ్చిరెడ్డి గూడలో తాగునీటి సమస్య తీర్చేందుకుగాను బోరు వేయించడం జరిగింది. అదేవిధంగా ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం నుండి అందిన షూస్ అందించడం జరిగింది. అంగన్వాడి కేంద్రంలో చిన్నారులతో కలిసి భోజనం చేసిన సర్పంచ్ బద్రి అర్చన ప్రభు గౌడ్. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయడం జరుగుతుందని, గ్రామ పంచాయతీలోని ఎనిమిది వార్డులలో మౌలిక వసతులైన త్రాగునీరు, విద్యుత్, మురుగునీటి కాలువలు, సిసి రోడ్లు మొదలగు వాటిని 100% పూర్తి చేయడానికి కృషి చేస్తున్నట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్ పట్లోళ్ళ భూలక్ష్మమ్మ, వార్డు మెంబర్లు మల్లెపూల శంకరయ్య, అవిష శ్రీనివాస్, కొత్తపల్లి మహేష్ బాబు, ఫీల్డ్ అసిస్టెంట్ జంగయ్య, మాజీ వార్డ్ మెంబర్ అవిష చంద్ర శేఖర్, గ్రామస్తులు మందాడ స్వరూప రెడ్డి, బద్రి రాజు, వేణు తదితరులు పాల్గొన్నారు.

## టి జె ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా మదాసు శ్రీనివాసరావు నియామకం

**పార్టీని బూత్ స్థాయి నుండి బలోపేతం చేస్తాం - నూతన అధ్యక్షుడు**



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** ఖమ్మం:తెలంగాణ జన సమితి టిజెఎస్ ఖమ్మం జిల్లా నూతన అధ్యక్షుడిగా మదాసు శ్రీనివా సరావు నియమితులయ్యారు.ఈ మేరకు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, రాష్ట్ర ఉపాధ్య క్షులు అంబటి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పల్లె వినయ్ కుమార్ గౌడ్, గోపగాని శంకరావు, జంట నగరాల అధ్యక్షులు మేకపోతుల నర్సయ్య కు పత్రికాముఖంగా కృత జ్ఞతలు తెలిపారు.నియామక అనంతరం మదాసు శ్రీనివాస రావు మాట్లాడుతూ, తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను అత్యంత క్రమశిక్షణతో, అంకితభావంతో నిర్వర్తి స్తానని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ కమిటీలను త్వరలోనే పూర్తి చేసి, బూత్ స్థాయి నుండి పార్టీని బలంగా పునర్నిర్మిస్తామని అన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలైన నీళ్లు, నిధులు, నియామకాలు మరియు సామాజిక న్యాయం దిశగా టిజెఎస్ జెండా కింద ప్రజలను ఏకం చేస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో జిల్లాలో పార్టీని బహుజన, ప్రజా ఉద్యమాల వేదికగా తీర్చిద్దడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.తన నియామకానికి సహకరించిన మందడి వెంకటేశ్వరావు, తీగ రాములు, బానోత్ మోహన్ రావు, బస్వాపురం నాగేశ్వరావు, వడ్లమూడి వెంకట్రావు తదితర నాయకులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు

# మియాపూర్‌లో ఘరానా చోరీ

## డెలివరీ బాయ్‌గా వచ్చి మహిళపై పెప్పర్ స్ప్రే దాడి

**మియాపూర్, రాజముద్ర న్యూస్ :** కొరియర్ డెలివరీ పేరుతో ఇంట్లోకి వచ్చి మహిళపై పెప్పర్ స్ప్రే దాడి చేసి 4 తులాల బంగారు మంగళసూత్రాన్ని ఎత్తుకెళ్లిన నిందితుడిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం, నిందితుడు కొరియర్ బాయ్‌గా బాధితురాలి ఇంటికి వచ్చి ముఖంపై పెప్పర్ స్ప్రే చల్లి మెడలోని బంగారు గొలుసు లాక్కుని పారిపోయాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలతో ఏపీ ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన షేక్ ఖాజా అర్షాల్, 20ని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి చోరీ చేసిన గొలుసు, పెప్పర్ స్ప్రే ప్యాకెట్ స్వాధీనం చేసుకున్నారు. అతనిపై ఇప్పటికే రెండు కేసులు ఉన్నట్లు తేలింది.ఒంటరి మహిళలను టార్గెట్ చేసి ఈ తరహా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. పరిచయం లేని డెలివరీ వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. కేసు ఛేదనలో కీలక పాత్ర పోషించిన మియాపూర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ విజయ్ నాయక్, ఎస్సై నరసింహారెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు ప్రేమ్ కుమార్, యాదయ్య, కానిస్టేబుల్ రూశ్వేశ్వర్, పూర్ణ చందర్ తదితర క్రైమ్ సిబ్బందిని కూకట్‌పల్లి జోన్ డీసీపీ అభినందించారు.




# ప్రభుత్వ బడి పిల్లలకై ఉచిత ఉదయపు పోషకాహారం

**పాల్గొన్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డి**



**షాబాద్, రాజముద్ర న్యూస్:** షాబాద్ మండలం హైతాబాద్ ప్రభుత్వ పాఠశాలలో (సిఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా అమెజాన్, సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ సంయుక్తంగా 9,000 మందికి పైగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం ఉదయ అల్పాహార (మార్నింగ్ న్యూట్రిషన్) కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించిన రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన రెడ్డి. ఈ పథకం ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో డిఈఓ వెంకటేశ్వర్లు, అన్నపూర్ణ ట్రస్ట్ ఆశిష్ భారత్వజ్, ఎంఈఓ లక్ష్మణ్, గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, సర్పంచులు శాంతమ్మ యాదయ్య, ప్రభాకర్ రెడ్డి, నర్సింలు, సబితా గోవర్ధన్ రెడ్డి, నవనీత స్వామి నాయకులు, విద్యార్థులు పాలుగోన్నారు.

## మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా స్కూల్ గేమ్స్ జోనల్ కార్యదర్శిగా ఏపీఎం విద్యాసాగర్ నియామకం



**బోడుప్పల్, రాజముద్ర న్యూస్:** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా విద్యాశాఖ అధికారి సమక్షంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ జిల్లా సమావేశంలో బోడుప్పల్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు (ఫిజికల్ డైరెక్టర్) ఏపీఎం విద్యాసాగర్ ఘట్కేసర్, మేడిపల్లి మండలాల జోనల్ కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఆయనను అధికారికంగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. క్రీడల అభివృద్ధికి, విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ఈ నియామకం ఎంతగానో తోడ్పడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. తనపై నమ్మకంతో జోనల్ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన జిల్లా విద్యాశాఖ అధికారులకు విద్యాసాగర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. క్రీడారంగంలో ఘట్కేసర్, మేడిపల్లి మండలాలను ముందంజలో ఉంచేందుకు శాయశక్తులా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. జోనల్ పరిధిలోని పాఠశాలల్లో క్రీడా పోటీలను పక్కా ప్రణాళికతో నిర్వహించి, ప్రతిభ కలిగిన విద్యార్థులను జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు సిద్ధం చేస్తామని పేర్కొన్నారు. జోనల్ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన ఏపీఎం విద్యాసాగర్‌ను ఘట్కేసర్, మేడిపల్లి మండలాల వ్యాయామ ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, క్రీడాభిమానులు కలిసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఆయనకు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్, మేడిపల్లి మండలాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు, పాఠశాలల ప్రతినిధులు, క్రీడా నిర్వాహకులు పాల్గొన్నారు.

## గర్భిణీలకు ప్రత్యేక గర్భధారణ వైద్య శిబిరం నిర్వహణ

**డాక్టర్ సురేష్**



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. ఎం. సురేష్ ఆధ్వర్యంలో ఉప్పల్‌వాయి సబ్‌సెంటర్లో గర్భిణీల కోసం ప్రత్యేక యాంటీ నాటల్ చెకప్ క్లినిక్ నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలకు సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించి, తల్లి గర్భస్థ శిశువు ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. రక్తపోటు, బరువు, హిమోగ్లోబిన్, గర్భస్థ శిశువు ఎదుగుదల తదితర అంశాలను పరిశీలించి అవసరమైన వైద్య సలహాలు చికిత్స అందించారు.

అధిక ప్రమాద గర్భిణీలను ప్రత్యేకంగా పరీక్షించి, వారి ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసి తగిన చికిత్స, మందులు అందించడంతో పాటు, అవసరమైన ఫాలో-అప్ సూచనలు ఇవ్వబడ్డాయి. గర్భధారణ సమయంలో అధిక ప్రమాద లక్షణాలు, వాటిని ముందుగానే గుర్తించడం, క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం చేయించుకోవడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అలాగే ప్రమాద సూచనలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా తల్లిపాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. పుట్టిన వెంటనే మొదటి గంటలోనే బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం, మొదటి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలు మాత్రమే ఇవ్వడం, తల్లిపాల వల్ల శిశువుకు రోగనిరోధక శక్తి పెరగడం, సరైన ఎదుగుదల మానసిక వికాసానికి తల్లిపాలు ఎంతో అవసరమని వివరించారు. తల్లిపాలు తల్లికి కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలిగిస్తాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో డా. రమ్యశ్రీ, ఏఎన్ఎం చంద్రకళ, ఆశా కార్యకర్త సవిత, ఆయుష్ ఫార్మసిస్ట్ శ్రీహరి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

